

# ఆలయ ప్రవేశము

"అక్క"

నాడు సాయంత్రం, అప్పడు, వీరడు చుట్ట కాలుస్తూ అరుగుమీద కూర్చుని, లోకాభిరామాయణం మాట్లాడుకుంటున్నారు.

అప్పడు :— వీరయ్యా, యీ శుక్రవారం మన వేణుగోపాలస్వామికోవెల మనకందరికి వదలి పెడతారట. మన మంతా వెళ్ళి స్వామి దర్శనము చేయవచ్చునట. గుళ్ళోకి వదలతారట. నాడు నే వెళ్ళాలనుకున్నాను. నీవు మరచి పోకుండా రా.

వీరడు :— ఆ, యిక యీ బాపనోళ్ళు మనల నేం చేయ గలరు.

అని యంటుండగానే రామ బ్రహ్మం గారు వీధిలోకి వచ్చారు. ఆయనను చూడగానే యీ మాలలిద్దరూ, దూరముగాబోయి, నిలబడ్డారు.

"సామే, మమ్ములను కోవెలలోకి వదలుతారట రేపు శుక్రవారం" అన్నాడు అప్పడు.

"సామీ, ఇక మీరు మేముఅంతా వొకటైనట్లేగదండి. ఆ గాంధిగారు పెళ్ళిళ్ళుకూడ చేసుకోవచ్చు నన్నారట" యన్నాడు వీరడు. "యికనేం" యన్నాడప్పడు.

వీళ్ళిద్దరిట్లు సంబరపడడం రామబ్రహ్మంగారికి పట్టరాని కోపం వచ్చినది. అయితే, అప్పణ్ణి ఆయన ఏమీ చేయలేదు. అప్పడూ, వీరడూ స్నేహితులు. అప్పడికి అయ్యగారితో సంబంధంలేదు. వీరడు అయ్యగారి పొలములో పని చేయువాడు. ఇంటి వెనుక దూరముగ అయ్యగారువేసిచ్చిన పాకలో భార్యా బిడ్డలతో కాపురమున్నాడు. వీరి సంభాషణ విని అయ్యగారికి ఆగ్రహమొచ్చినదని చెప్పాను కదా. వీరణ్ణి అరికాలిక్రింద పెట్టి రాచేయవలెనని సంకల్పించాడు అతనిని పిలిచి,

"వీరడూ! శుక్రవారంలోపల నా రెండు వందల రూపాయలు అప్పతీర్చేయాలి. ఇకవొక్క నిమిషమునే నాగను"

అని చెప్పి, "దూరంగా పోవేధవా, మీది మీది కొస్తావేమి? ఆలయ ప్రవేశమైతే నాకేం? నా మీదపడకు"

అని కేకలేశాడు. వీరడూ, అప్పడూ నక్కుతూనక్కుతూ వెనక్కు వెనక్కు వెళ్లారు.

మరునాడు సాయంత్రం ఇంటికి వెళ్లగానే, వీరడి భార్య వానిని జూచి,

"నీవు, నా కెక్కడ దాపరించావు? ఏదో లేని పోని తగువులు తెస్తావు? నలుగురిలో నా సిగ్గుబోతుంది. నే చావలేను నీతో. నీ కెందుకు పంతులు గారితో వాదం? వాళ్ల అమ్మాయిని పెళ్లిచేసుకుంటానని ఎకసెక్కాలు మాట్లాడావట, ఆయనకు కోపం వచ్చిందట. రేపు సాయంత్రం లోపల పాక కాళీచేయకపోతే తట్టా బుట్టా బయట పడేసి పాక పీకేస్తారట. ఈ గొడవంతా వాళ్ళ చాకలాడు వచ్చి చెప్పాడు. పంతులుగారమ్మాయిని పెండ్లాడుతాడట. పంతులుగారమ్మాయిని, యీ వెర్రి మొగం" అని అప్పుడే తనకు సవతివచ్చినంత కోపంతో తూర్పార బట్టినది.

వీరడు నిశ్చేష్టుడైనాడు. అయ్యో, "నేనేం తప్పుమాటన్నాను పత్రికలలో చదివి ఊళ్ళో పెద్ద మనసులను కొన్న కదా నే నన్నాను. దానికింత కోపపడడానికి కారణం ఏముంది? పంతులుగారి అమ్మాయిని పెళ్ళాడ తాననలేదు. మాలలు మాటాడుకోకూడా స్వతంత్రులు కారా? ఏమో అయినదయ్యి పోనది. నోరు జారినది. ఇప్పుడేమి గతి. 200 అప్పు ఎలాతీర్చడం. ఈ పాకవదలి ఎక్కడికిపోడం? నేనింక అయ్యగోరి రైతునుకూడా కాను. నా జీవనమెలాగా వచ్చినా" యని ఆలోచించాడు.

చీకటిపడినది. ఆ గురువారం సాయంత్రం రామ బ్రహ్మం గారు తన 5 సంవత్సరాల అమ్మాయితో వేణుగోపాలస్వామి కోవెలకు వెళ్లారు. పంతులుగారిని చూడగానే పూజారి వినయముతో ఆహ్వానించాడు.

అమ్మాయిని చూచి "దామ్మా, దేవున్ని చూడు, దండం పెట్టూ" యని రామబ్రహ్మంగార్ని చూచి "పంతులుగారూ, మీ అమ్మాయిది పునర్జన్మయండీ, నిజంగా మన వేణుగోపాల స్వామిదయే. ఈ అమ్మాయి బ్రతికి బట్ట కట్టుతుందనుకో లేదండి."

"అవునవును, నేను స్వామివారికి, అభిషేకార్చనలు చేయిస్తానని చెప్పుకున్నాను, మామూలువి కాక, అందుకే ఇప్పుడొచ్చాను. రేపటినుండి వర్ణసంకరమేకదండి, ఆలయానికి రావడానికికూడ ఆశలేనట్టుంది. ప్రొద్దుపోతోంది."

పూజారి అర్చనచేసి కొబ్బరికాయ కొట్టేటప్పటికి ఎక్కడుండినదో, గర్భగృహంలోపలికెలా వచ్చిందో, విగ్రహము వెనుకనున్న నాగుపాము ముందుకొచ్చినది. గర్భ గృహపు గడపమీద పడగెత్తి నిల్చింది. "బాబోయి, పాము పాము" యని పంతులు పూజారి ఇద్దరు కేకేసారు. చేతులుజోడించి నిలుచున్న అమ్మాయిని పంతులుగారు చంకకెత్తుకొని దిగులుతో వెనక్కునడుస్తున్నాడు.

ఎక్కడినించివచ్చాడో వీరడు పామును అతిలాఘవముగ పట్టి గిరగిర త్రిప్పి మూడుసార్లు నేలకేసి కొట్టాడు. పాము చచ్చినది. నోట్లో తడియారిపోయిన పంతులు పూజారి ఇద్దరికి వొంటిమీద తెలివివచ్చినది.

రామబ్రహ్మం "వీరయ్యా, నాడు వేణుగోపాలస్వామి దయవల్ల నా బిడ్డ బ్రతికినది. నేడు నీవల్ల మేముగ్గురం బ్రతికాము. నీ ఋణముతీర్చుకోలేము. అయితే వీరయ్యా! పాము వచ్చిన సంగతి నీకెలా తెలిసినది. నీవు కోవెలలో కెలా వచ్చావ్?"

"సామీ, చమిస్తానంటే మనవిచేత్తాను. మీ పాదాల మీద పడతాను చమించాననండి. సామీ చమించాననండి."

"క్షమించానులేరా, ఎలా వచ్చావ్ కోవెలలోకి?"

"సామీ, మీరు మీ డబ్బుకట్టమని నిక్కచ్చి చేసారా, ఎలా తెస్తాను చెప్పండి. ఈ గుడి తలుపులు మూసాక సామి వారి మెళ్ళోని చంద్రహారం తీసుకెల్లి మీ డబ్బు మీకిత్తామన్న బుద్ధిపుట్టింది. అందుకని ఎవరూ చూడనపుడొచ్చి ఆ వాహనం క్రింద దాక్కున్నాను. మీరు పాము పామని కేకెయ్యగానే, అక్కడవుండ బుద్దెయ్యలేదు. వచ్చిపామును చంపాను. గుళ్ళో దూరినందుకు చమించాలి మా రాజా"

"ఎందుకురా చమించడం రేపటినుండి మీ కాలయ ప్రవేశమేగా, రేపొచ్చేది, నేడొచ్చావ్, అంతేనా"

"అది కాదు సామే, నల్లరాతి విగ్రహాని చూడడం యేం గొప్పండి. మీబోటి మనుస్సుల మనస్సనే ఆలయంలో ప్రవేశము లేక పోతే, ఈ ఆలయ ప్రవేశాలు మా కెందుకండీ" యంటూ బయటకు వెళ్ళాడు.

మరునాడాలయ ప్రవేశం, హరిజనుల నందరినీ ప్రవేశ పెట్టారు. అందరూ స్వామిని చూడడానికి ఆతురపడుతున్నారు.

అయితే, వీరయ్యమాత్రం రాలేదు. అప్పుడెంత బతిమాలుకున్నా, "ఆ నల్లరాయి మనకేం చేస్తుందంటున్నాడు. పంతులుగారు దూరాన్నుండి· యిదంతా చూస్తూ, ముందు రోజు వీరడన్న మాటలు మననం చేసుకుంటున్నారు.